మధురమైనది తెలుగు భాష

నందికొట్కూరు: తెలుగు భాష ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటిన మహానుభావుడు గిడుగు రామ్మూర్తి అని డీసీఓ శ్రీదేవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ హుసేన్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాల, పగిడ్యాల మండలం లక్ష్మాపురం డాక్టర్ బీఆర్ గురుకులం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు బాష దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష ప్రపంచంలోనే గొప్ప స్థానంలో నిలిచిందని స్పష్టం చేశారు. మాతృ భాష అభివృద్ధి కోసం అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం కవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ వెంకట రమణమ్మ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ తాజుదీన్, డాక్టర్ రఘుపతిరెడ్డి, భాస్కర్, అన్వర్ హుసేన్, ఝూన్సీరాణి, రాజశేఖరరెడ్డి, మోహన్‌మురళి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం క్రిష్ణమూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది తెలుగు బాషా దినోత్సవం కారకుడైన గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాకు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లులర్పించారు. అనంతరం తెలుగు, వ్యాయామ ఉపాధ్యాయులు షరీఫ్, నాగరాజు సన్మానించారు. విద్యార్థులు జానపద నృత్యాలు, చెక్క భజన, కోలాటాలు, బంజారా పాటల నృత్యాలు అలరించాయి.

మిడుతూరు: మండల కేంద్రంతోపాటు కడుమూరు, చెరుకుచెర్ల, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా బాలికల విద్యాలయంలో మాతృబాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధాన్‌చాంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు: పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు ప్రిన్సిపాల్ వై.శ్యామల పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా దినోత్సవం

ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల పీఈటీ పుల్లయ్య ఆధ్వర్యంలో గురువారం హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ దినోత్సవాన్ని స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవనంలో నిర్వహించారు. ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలను వివరించారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని, క్రీడల్లోనూ మంచి ప్రతిభ చూపాలన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలుగుభాష గొప్పదనాన్ని వివరించారు. ముందుగా రచయిత గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

వెలుగోడు: విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకష్ణదేవ రాయలు చెప్పిన విధంగా దేశ భాషలందు తెలుగు లెస్స అని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని అన్నారు. గురువారం మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషాదినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక తెలుగాభాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చందర్ గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులకు క్రీడా, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీసీఓ శ్రీదేవి.



గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చాంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కేజీబీవీలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ శ్యామల, అధ్యాపకులు



నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



వెలుగోడు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

అలరించిన 'జయహో జానపదం'



విద్యార్థుల కోలాటం సందడి

నంద్యాల(అర్బన్): గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించుకొని గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని జయహో జానపదం పేరుతో ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాలలో వైభవంగా నిర్వహించారు. జానపద, కళా వస్తువుల ప్రదర్శన, కళాకారుల సన్మానాలు, నృత్య ప్రదర్శనలు, కోలాటాలతో పాఠశాల ప్రాంగణం శోభాయామానంగా మారింది. ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, గ్రీన్ సొసైటీ గౌరవాధ్యక్షుడు రఘువీర్ మాట్లాడుతూ తెలుగు భాషా, సంస్కృతి గొప్పతనాన్ని వివరించారు. జనపదుల జీవనాడి జానపదమని, నేటి తరానికి మన సంస్కృతి, సాంప్రదాయాలను పరిచయం చేయాలనే ఆకాంక్షతో కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్సా అని, భావాలను పలికించే భాష తెలుగు అని పేర్కొన్నారు. తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్ బాష అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోక కల్యాణం కాంక్షిస్తూ గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



నీమాస్త్రం తయారీని పరిశీలిస్తున్న ఏఓ

పాములపాడు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చునని ఏఓ ఫణీశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని వేంపెంట గ్రామంలో గురువారం 'పొలంబడి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో సేంద్రియ కర్బనం పెంచాలని సూచించారు. నీమాస్త్రం, వేప చెక్క వంటివి ఉపయోగించాలని తెలిపారు. అజోళ్ల ఉపయోగం, నీమాస్త్రం తయారీ విధానం, వాటి ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. రసాయణ ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వినియోగించాలని పేర్కొన్నారు.

వాహన ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోండి

ఆత్మకూరురూరల్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని రకాల వాహనాలకు నిర్దేశిత సంస్థల వద్ద ఆటోమేటెడ్ టెస్టింగ్ ద్వారా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్ పొందాలని ఆత్మకూరు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్ఎన్ రెడ్డి ఓ ప్రకటన ద్వారా సూచించారు. ఆత్మకూరు ఎంవీఐ కార్యాలయ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లె, మిడ్తూరు, జూపాడుబంగ్లా, బ్రాహ్మణకొట్కూరు, పగిడ్యాల, శ్రీశైలం, నందికొట్కూరు మండలాలకు చెందిన అన్నిరకాల వాణిజ్య వాహనాలు ఫిట్‌నెస్ పరీక్షలకొరకు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందేందుకు నంద్యాల మండలంలోని చాబోలు గ్రామంలో ఉన్న శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ వారి వద్దకు వెళ్లాల్సిందిగా సూచించారు. సెప్టెంబర్ 1 నుంచి ఎంవీఐ కార్యాలయంలో గాకుండా పైన తెల్పిన సంస్థ వద్ద ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ ధృవీకరణ పత్రాలు పొందాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న నీటి విడుదల

వెలుగోడు: తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు భానుకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ ద్వారా 11,300 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరుతున్నాయి. వీబీఆర్ పూర్తి స్థాయి నీటిమట్టం 16.95 టీఎంసీలు కాగా గురువారం 14.677 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే వీబీఆర్ నుంచి మద్రాసు కాలువకు 5 వేల క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా గాలేరుకు 6500 క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి అవసరాలకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఏఈ శివనాయక్ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన విష్ణు

వెలుగోడు: బోయరేవుల గ్రామ ప్రధాన రహదారిలో స్పీడ్ బ్రేకర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.వివరాలు.. ఆత్మకూరు మండలం అమలాపురం గ్రామానికి చెందిన విష్ణు గురువారం సాయంత్రం నంద్యాల నుంచి వెలుగోడుకు బైక్‌పై వెళుతున్నాడు. బోయరేవుల గ్రామ సమీపంలో రహదారిపై స్పీడ్ బ్రేకర్ వద్ద ముందు వెళుతున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనక బైక్‌పై వచ్చిన విష్ణు అదుపుచేయలేక ఢీకొట్టాడు. ప్రమాదంలో విష్ణుకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెలుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ తిరుపతి

మిడుతూరు: ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్, బాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ తిరుపతి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



పగిడ్యాల రోడ్డులోని వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నందికొట్కూరు: వసతి గృహాలకు త్వరలోనే మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటునట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలం, పట్టణంలోని వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. వసతి గృహాల గదులను, మరుగుదొడ్లను, బాత్‌రూమ్‌లను, పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు తగినంత మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

పగిడ్యాలలో..

పగిడ్యాల మండల కేంద్రంలోని వసతి గృహాన్ని ఎంపీడీఓ వెంకటరమణ గురువారం పరిశీలించారు. వసతి గృహంలోని సమస్యలను ఎంపీడీఓ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ శివకుమార్, డీటీ రవి, ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోండి



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధాకర్

జూపాడుబంగ్లా: రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించుకుని సేంద్రియ ఎరువులు వాడాలని బనవాసి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, రవిగౌడు తెలిపారు. జూపాడుబంగ్లా వెలుగు కార్యాలయంలో గురువారం రైతుమిత్ర గ్రూపుల రైతులకు పంటల సాగు-పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధికదిగుబడులు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, అందుకనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. భూసార పరీక్షలు, విత్తనాలు ఎంపిక, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంలో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అదేవిధంగా పంటల సాగులో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీసీ కర్రెన్న, అకౌంటెంటు కైరూన్‌బీ, సీసీలు గాంధీ, విజయలక్ష్మి, నాగన్న, నాయక్, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు మల్లిఖార్జున, రైతులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంక్షేమమే ధ్యేయం

వెలుగోడు: ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ షేక్ అమానుల్లా సూచించారు. గురువారం వెలుగోడులోని గట్టు తాండ, చెంచుకాలనీ, విజయదుర్గ కాలనీ, చింతల కుంట్ల చెంచు కాలనీలో ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ, ఉపాధిహామీ పథకం ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గిరిజనులకు పక్కా గృహాలు, విద్యుత్ సౌకర్యం, సురక్షిత మంచి నీరు, రోడ్ల నిర్మాణం, నాణ్యమైన విద్య అందించడమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం అన్నారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ మల్లికార్జున, ఈఓ హరిలీల పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రతిభ

శ్రీశైలంప్రాజెక్ట్: 'పర్యావరణం-జీవ వైవిద్యం' అనే అంశంపై జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో సున్నిపెంట గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు, పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన ఈ పోటీల్లో స్థానిక ప్రతిభా పాఠశాల విద్యార్థులు ఎం.శ్రీనివాస్ నాయక్, ఆర్.ఈశ్వర్‌నాయక్ జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచి జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, షీల్డ్ పొందారు. ఈ సందర్భంగా గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జ్ పీఓ ఎ.సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్.ఎస్.జి.కిశోర్ బాబు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ షేక్షావలి

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేత్రదానం పక్షోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు షేక్షావలి నేత్రదానం ప్రాముఖ్యత, దృష్టి లోపం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. తదనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి చిరంజీవి మాట్లాడుతూ నేత్రదానం ప్రాణదానంతో సమానమన్నారు. సాధారణ, దురదృష్ట వశాత్తు వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు కంటి బ్యాంక్ ప్రతినిధులకు సమాచారం అందజేస్తే స్టైరైల్ పద్ధతి ద్వారా కళ్లను సేకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్, టీబీ సూపర్‌వైజర్ రవి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రజలు, విద్యార్థులు, గృహిణీలు, వ్యాపారులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐకాన్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ డైరెక్టర్ చిట్టిబాబు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నామమాత్రపు ల్యాబ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు పదో తరగతి మార్క్స్ లిస్ట్, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్, రెండు ఫోటోలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటుకు ఎదురుగా ఉన్న ఐకాన్ కంప్యూటర్ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. వివరాలకు 9848576574 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌బాబు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ నూతన కమిషనర్‌గా రమేష్‌బాబును నియమిస్తూ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన కర్నూలు సూపరింటెండెంట్‌గా పని చేసి బేతంచెర్లకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం అక్కడి నుంచి ఆత్మకూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న హరిప్రసాద్‌ను డీఎంఏకు రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు అందాయి. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ద్వారా ఉత్తర్వులు వెలువడ్డాయి.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతలకు స్వామి వారి ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మహానంది పుణ్యక్షేత్రంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన భవనాశి నారాయణ, గురుకుమారి దంపతులు గురువారం రూ.50,111 ఆర్థిక సాయం అందించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. దాత నారాయణ దంపతులకు దేవస్థానం అధికారులు కండువా కప్పి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదేల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త చందమాల కమలాకర్ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృత దేహానికి ఎంపీటీసీ సురేష్‌తోపాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో రూ. 5 వేలు ఎంపీటీసీ సభ్యుడు అందజేశారు.

హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్



ధ్యాన్ చంద్ చిత్ర పటానికి నివాళులర్పించిన డీసీఓ శ్రీదేవి, ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ



కోట జెడ్పీ హైస్కూల్‌లో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం సలీంబాషా, ఉపాధ్యాయులు

నందికొట్కూరు: హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ అని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకులం జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి అన్నారు. లక్ష్మాపురం గురుకులం, పట్టణంలోని కోట జెడ్పీ హెస్కూల్, కొణిదేల జెడ్పీ హైస్కూల్‌లలో క్రీడా ప్రపంచ దినోత్సవం, ధ్యాన్ చంద్ జయంతి నిర్వహించారు. ఆయా స్కూళ్లలో ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మాపురం గురుకులంలో క్రీడాకారులను డీసీఓ క్రీడా అసోసియేషన్ నాయకులు, ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ, ఉపాధ్యాయురాలు అభినందించారు. ఆయా కార్యక్రమాలలో గురుకులం వైస్ ప్రిన్సిపల్ కృష్ణకుమారి, ఉపాధ్యాయురాలు ఉమా, బాంధవి, ఈఈటీ లావణ్య, కోట జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం సలీంబాషా, పీడీ శ్రీనాథ్, కొణిదేల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరామచంద్రమూర్తి, పీడీ రవికుమార్, క్రీడాకారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

జూపాడుబంగ్లా: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, వైఎస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరశర్మ తెలిపారు. గురువారం పాఠశాలలో స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి విద్యార్థులకు రన్నింగ్, స్కిప్పింగ్, త్రోయింగ్ తదితర క్రీడాపోటీలను నిర్వహించి ప్రతిభ కనపరచిన వారికి బహుమతులను అందజేశారు.



విద్యార్థుల పిరమిడ్ విన్యాసం

కొత్తపల్లి:విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని మాజీ ప్రధానోపాధ్యాయులు మంగన్న అన్నారు. గురువారం మండలంలోని దుద్యాల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా వ్యాయామ ఉపాధ్యాయులు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ క్రీడ దినోత్సవంలో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సర్వదేవతా పూజ్యుడు గణపతి



ప్రవచనాలు వినిపిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

శ్రీశైలంటెంపుల్: ఇంద్రాది దేవతలు గణపతిని ఆరాధిస్తారని, సర్వదేవతా పూజ్యుడు గణపతి అని ప్రముఖ ప్రవచకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ పేర్కొన్నారు. శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గణపతి గాథలు ప్రవచనాలు గురువారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సామవేదం షణ్ముఖశర్మ ప్రసంగిస్తూ.. గణపతి దేవగణాలకు అధిపతి అన్నారు. గణపతిని వివిధ రూపాలలో ఆరాధించడం మన సంప్రదాయమన్నారు. సర్వైశ్వర్యపతిగా లక్ష్మీగణపతిని, గొప్పతనానికి అధిపతిగా మహాగణపతిని, శీఘ్రఫలదాతగా క్షిప్రగణపతిని, కోరికలు తీర్చే గణపతిగా చింతామణి గణపతిని, సిద్ధినిచ్చే గణపతిగా సిద్ధ గణపతిని ఆరాధిస్తామన్నారు. అలాగే సాహిత్యంలో అక్షర గణపతిగా, సంగీతంలో స్వరరాగ గణపతిగా, నృత్యంలో నర్తన గణపతిగా, శిల్పచిత్ర కళలలో బహురూప గణపతిగా, సకల కళాస్వరూపుడై వినాయకుడిగా విరాజిల్లుతున్నారన్నారు. గణపతి అర్చించే విధానం కూడా సులభమని అన్నారు. వినాయకచవితి రోజున శాస్త్రం పేర్కొన్న 21 పత్రాలతో స్వామివారిని ఆరాధించడం ఫలదాయకమన్నారు. సస్య, క్షేత్ర గణాలకు కూడా గణపతి రక్షకుడు అని పేర్కొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండ్లెం, తరిగోపుల గ్రామాల్లో చేస్తున్న పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంటనమోదుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. పంటనష్టం వాటిల్లితే నష్టపరిహారం వర్తిస్తుందన్నారు. పంటరుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు.



ఈపంట నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఏఓ

బడికి వెళ్లేందుకు సౌకర్యవంతమైన రోడ్డు





తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న మండ్లెం జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి, హైవే రోడ్డుమీదుగా పాఠశాలకు వెళ్లేందుకు తారుతో నిర్మిస్తున్న ర్యాంపు

జూపాడుబంగ్లా: 'సాక్షి' దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'మడుగుదాటనిదే బడికి చేరలేరు' కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ వెంటనే మండ్లెం జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డిని కలిసి సమస్య వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చే దారిని పరిశీలించారు. అండర్‌టన్నెల్ కింద నిలిచిన మురికినీటిని తొలగించి విద్యార్థులు వెళ్లేందుకు వీలుగా రోడ్డును ఏర్పాటు చేయాలని నేషనల్‌హైవే 340సీ రోడ్డు కాంట్రాక్టర్లకు తహసీల్దార్ సూచించారు. వెంటనే యంత్రాలను తెప్పించి బ్రిడ్జి మురికినీటిని తొలగించి సుద్దబిలుకుతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేలా రోడ్డును ఏర్పాటు చేయించారు. రోడ్డు సౌకర్యవంతంగా ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్

వసతి గృహాల తనిఖీ



ఆత్మకూరులో వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని పలు వసతి గృహాలను మండల అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ రత్నరాధిక మాట్లాడుతూ.. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సమీకృత వసతి గృహంతో పాటు గిరిజన వసతి గృహాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ వసతి గృహాల్లో విద్యార్థులకు సరైన వసతులు లేవన్నారు. బాత్‌రూమ్‌లకు డోర్‌లు లేకపోవడం, పలు గదులకు సరైన డోర్లు కూడా లేవన్నారు. అలాగే భవనాలు శిథిలమైనట్లు చెప్పారు. తనిఖీ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని వారు వెల్లడించారు.